www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి (మా అక్షరం-మీ ఆయుధం, తెలుగు దినపత్రిక)

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -297 సోమవారం 2 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# యువశక్తి బడ్జెట్

## 53.5 లక్షల కోట్లు

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.



**మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం**

**బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు**

**వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు**

**ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం**

- 'కష్టమ్స్' తగ్గింపు.. ఎగుమతులు పెంచే వ్యూహాలు
- దేశంలో మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు
- రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లు.. ఏపీకి ఒకటి
- 2047 వరకూ డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే
- మూలధన వ్యయం లక్ష కోట్లు పెంపు
- నిర్మాణ, తయారీ రంగాలకు మరింత ప్రోత్సాహం
- సెమీ కండక్టర్ పరిశ్రమకు 40 వేల కోట్లు
- 2 లక్షల కోట్ల మేర తగ్గిన పన్ను వసూళ్లు
- పలు పథకాలకు కేటాయింపుల్లో కోతలు
- 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మల

2లో.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అల్కరాజ్...



**చారిత్రక కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి**

**ఫైనల్‌లో నొవాక్ జకోవిచ్‌ను ఓడించి చారిత్రక విజయం**

**అత్యంత పిన్న వయసులో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు**

**మెల్‌బోర్న్ ఫైనల్స్‌లో జొకోవిచ్‌కు ఇదే తొలి ఓటమి**

**, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

టెన్నిస్ ప్రపంచంలో స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో నొవాక్ జకోవిచ్‌ను ఓడించి తన తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో, ఓపెన్ శకంలో అత్యంత పిన్న వయసులో కెరీర్ గ్రాండ్‌స్లామ్ (నాలుగు మేజర్ టైటిళ్లు) పూర్తి చేసిన ఆటగాడిగా అల్కరాజ్ అరుదైన రికార్డు సృష్టించాడు.

మిగతా 3లో.




## చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్!

**స్కిల్ కేసులో ఆయన ప్రమేయంపై ఆధారాల్లేవు**

**ఆయన పాత్ర లేదు.. నిందితుడిగా చేర్చలేం: ఈడీ**

**చార్జిషీటును పరిగణనలోకి తీసుకున్న కోర్టు**

**ఈ కేసులో గత నెలలోనే ఆయనకు సీఐడీ క్లీన్‌చిట్**

**నాడు నానా గగ్గోలు పెట్టిన జగన్ అండ్ కో**

**నేడు ఈడీ తేల్చేయడంతో మూతబడిన నోళ్లు**

అమరావతి, **, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో కొందరు నిందితులు ప్రభుత్వ నిధులు మళ్లించినట్లు గుర్తించామని.. కానీ చంద్రబాబు పాత్ర మాత్రం లేదని పేర్కొంది. అందువల్ల ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేమని తెలిపింది. గత నెల 28న విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ (మనీలాండరింగ్ నిరోధక చట్టం)

మిగతా 3లో.

## అంబటి కి 14 రోజుల రిమాండ్

**అంబటి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్**

**న్యాయాధికారి ఉత్తర్వులతో అంబటిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు**

**అమరావతి, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు మొబైల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసులు శనివారం రాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. విషయంలోకి వెళితే.. గుంటూరు అమరావతి రోడ్డులోని గోరంట్ల వద్ద శుక్రవారం తిరుమల

మిగతా 3లో.



## మీ జంగిల్ రాజ్ భూస్థాపితం కాకతప్పదు

**అంబటి, జోగి ఇళ్లకు నిప్పు పెట్టి భయాన్ని కలిగించానని అనుకోవడం మీ భ్రమే**

**ఆ వేడి మీ సర్కారును దహించక మానదు - వైఎస్ జగన్**

**అమరావతి, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

ప్రజాస్వామ్యంలో హింసా జ్వాలలను రేపే చేయి కాలక తప్పదు. అరాచక, ఆటవిక పాలన అంతం కాకతప్పదు. మీరు సృష్టించిన 'జంగిల్ రాజ్' భూస్థాపితం కాకతప్పదు. చరిత్ర చెప్పే సత్యం ఇది' అని సీఎం చంద్రబాబును ఉద్దేశించి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ జగన్ శాపనార్థాలు పెట్టారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడి, ఇంటిని దహనం చేసిన నేపథ్యంలో జగన్ ఆదివారం ఆయన్ను

మిగతా 3లో.



## రవిచంద్రకు బాధ్యతలు

**టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు**

**సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్రకు అదనపు బాధ్యతలు**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



**అమరావతి, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) అనిల్ కుమార్ సింఘాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు (ఫిబ్రవరి 1న) ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా

మిగతా 3లో.

## తీరని అన్యాయం

**తెలంగాణ ఏం తప్పు చేసింది..జాతీయ ఉపాధి హామీకి బీజేపీ తూట్లు**

**ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమాన్ని పట్టించుకోలేదు**

**సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు, ఎంపీలు ప్రధానిని కలుద్దాం : ఉప ముఖ్యమంత్రి భట్టి విజ్ఞప్తి**

హైదరాబాద్ **ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, పార్లమెంటు సభ్యులు (ఎంపీలు) బృందంగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుద్దామని విజ్ఞప్తి చేశారు.



## మీ ఆదేశాలతోనే ట్యాపింగ్ జరిగిందా?

**నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు విచారించిన సిట్**

**ప్రశ్నలు సంధించిన ఆరుగురు అధికారులు**

**సిట్ సేకరించిన ఆధారాలతో ప్రశ్నలు.. ఎదురు ప్రశ్నించిన కేసీఆర్**

**విచారణ సమయంలో ఇంటిబయట ఉద్రిక్తత, కార్యకర్తల నిరసనలు**

హైదరాబాద్ **, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సిట్ అధికారులు విచారించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో తన సొంత

మిగతా 3లో.





# యువశక్తి బడ్జెట్

**ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**
జాతీయ, అంతర్జాతీయ సవాళ్లకు దీటుగా బడ్జెట్‌లో 'స్వదేశీ మంత్రం' పఠించారు! సుంకాలకు జంకేది లేదంటూ ఆత్మ నిర్భర అస్త్రానికి పదును పెట్టారు! ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న రంగాలకు 'కస్టమ్స్' తగ్గించారు! నిర్మాణ, తయారీ రంగాలకు మరింత 'బూస్ట్' ఇచ్చారు! గ్లోబల్ మార్కెట్లతో కలిసిమెలిసి సాగాలని.. ఎగుమతులను మరింతగా విస్తరించాలని సంకల్పించారు! జెన్‌జీకి జైకొట్టారు! ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు సంకల్పం చెప్పుకొన్నారు! వ్యక్తిగత ఆదాయ పన్ను విషయంలో మాత్రం ఎటువంటి మార్పులూ చేయలేదు. ఉద్యోగులకు ఎటువంటి ఊరట కల్పించలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇందులో మూలధన వ్యయానికే రూ.12.21 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అంటే.. దాదాపు లక్ష కోట్లను పెంచారు! భారత్ సహా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చిప్‌ల కొరత! దాని పరిష్కారానికి గతంలో ఏర్పాటు చేసిన ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను విస్తరించారు. రూ.22,919 కోట్లతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌కు కేటాయింపులను రూ.40 వేల కోట్లకు పెంచారు. అంతేనా, ఇప్పుడు ప్రపంచమంతా రేర్ ఎర్త్ మినరల్స్ చుట్టూ తిరుగుతోంది. అందుకే, గత ఏడాది నవంబరులో ప్రారంభించిన రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ స్కీముకు కొనసాగింపుగా రేర్ ఎర్త్ కారిడార్స్ ఏర్పాటు చేయనున్నారు.ఆ ఖనిజాలు అధికంగా ఉన్న ఒడిసా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చేయూత ఇవ్వనున్నారు. ఎగుమతి చేసే సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని ఒకటి నుంచి మూడు శాతానికి పెంచారు. లెదర్, జౌళి ఉత్పత్తులు, సింథటిక్ ఫుట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల గడువును ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. కొన్ని రకాల రసాయనాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అందుకే, మూడు కెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, కంటెయినర్ల తయారీకి ఇప్పుడు డిమాండ్ పెరిగింది. అందుకే, రాబోయే ఐదేళ్లలో ఇందుకు రూ.10 వేల కోట్లను ఖర్చు చేయాలని సంకల్పించారు. బయో ఫార్మా మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు రూ.10 వేల కోట్లను కేటాయించారు. ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి సమ్మిళిత, సమగ్ర వ్యూహాన్ని రచించారు. మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 'స్వదేశీ'కి మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేశారు. మొదటి దశలో.. ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తున్న రక్షణ, ఇంధన, ఆరోగ్య రంగాల్లో స్వయంసమృద్ధిపై వెంటనే దృష్టి పెట్టనున్నారు. ఐదు మెడికల్ హబ్‌లు, మూడు ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేస్తారు. రెండో దశలో.. ఇతర దేశాలతో పోటీ పడేలా సెమీ కండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ ఎగుమతులకు పెద్దపీట వేయనున్నారు. మూడో దశలో.. దేశీయంగా సరసమైన ధరకు దొరకని ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటారు. వెరసి, ఒక్క మౌలిక సదుపాయాల రంగాని (ఇన్ఫ్రా)కే దాదాపు రూ.12 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నారు. కాగా.. ఈసారి బడ్జెట్లో తెలుగు రాష్ట్రాలకు కాస్త ఊరట దక్కింది. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభం కానున్నాయి. వీటిలో రెండు ఏపీతోనూ అనుసంధానం అవుతాయి.
ఏపీలో రేర్ ఎర్త్ మినరల్ కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఇక, హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారిన సంగతి తెలిసిందే. విశాఖలోనూ భారీ డేటా సెంటర్లు వస్తున్నాయి. వీటిని మరింత ప్రోత్సహించేలా విదేశీ కంపెనీలకు 2047 వరకూ ట్యాక్స్ హాలీడే ప్రకటించారు. జిల్లాకు ఒకటి చొప్పున బాలికల వసతి గృహాలూ ఏర్పాటు కానున్నాయి. అన్నదాతకు బడ్జెట్లో పెద్దగా తాయిలాలు లేవు. కానీ, కొబ్బరి రైతులకు కోకోనట్ ప్రమోషన్ స్కీమ్ ప్రకటించారు. జీడిపప్పు, కోకో, చందనం ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధికి ప్రణాళికలు రచించారు. మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల తరహాలో సెల్ఫ్ హెల్ప్ మార్ట్‌లు మినహా పథకాలు ప్రకటించలేదు. ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను; రూ.2000 కోట్లతో సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. చివరిగా.. బడ్జెట్‌పై స్టాక్ మార్కెట్ పెదవి విరిచింది. ప్రారంభంలో పాజిటివ్‌గా కదలాడిన మార్కెట్ ఒక సందర్భంలో కుప్పకూలింది. సెన్సెక్స్ ఏకంగా 2400 పాయింట్లు పడిపోయింది. ఇందుకు కారణం.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌ను నిరుత్సాహపరచడానికి సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ను ఫ్యూచర్స్‌లో 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్‌లో 0.01 శాతం నుంచి 0.15 శాతానికి పెంచడమే.

ఏటా బడ్జెట్ వేళ.. చేనేత కళావైభవాన్ని చాటిచెప్పేలా నిర్మలా సీతారామన్ ధరించే చీరలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. చేనేత కళపై తనకున్న మక్కువ చూపుతూ.. ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగం కోసం సొంత రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన కాంజీవరం చీరను ఎంచుకున్నారు. బంగారు రంగు జరీ అంచుతో ఉన్న ముదురు ఎరుపు(మెజెంటా) రంగు చీరను ఆమె పసుపు రంగు బ్లౌజ్‌తో జత చేశారు. త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన చీరను ధరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

85నిమిషాల పాటు సాగిన బడ్జెట్ ప్రసంగం

వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన నిర్మల... ఈ ఏడాది తన ప్రసంగాన్ని 85 నిమిషాల్లో క్లుప్తంగా ముగించారు. ఆదివారం ఉదయం 11గంటలకు ప్రారంభమైన ప్రసంగం మధ్యాహ్నం 12:25నిమిషాలకు ముగిసింది. నిర్మలా సీతారామన్ గత ప్రసంగాల నిడివిని పరిశీలిస్తే.. చాలా వరకు ప్రసంగాలు 90 నుంచి 120 నిమిషాల మధ్యలో ముగిశాయి. 2020లో బడ్జెట్ ప్రసంగం.. ఆమె కెరీర్‌లోనే కాకుండా దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ప్రసంగంగా రికార్డు సృష్టించింది. అప్పట్లో ఆమె 2గంటల 40నిమిషాల పాటు మాట్లాడారు. 2024లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కేవలం 56నిమిషాల్లోనే ముగించారు. గతేడాది (2025) బడ్జెట్ ప్రసంగం 1గంట 14నిమిషాల పాటు, 2019లో ఆర్థికమంత్రిగా తొలి బడ్జెట్ ప్రసంగం 2 గంటల 17నిమిషాల పాటు కొనసాగింది.



## సంస్కరణలకు కొత్త శక్తి

కేంద్ర బడ్జెట్ చరిత్రాత్మకం. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు మార్గదర్శనం చేస్తుంది. నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఓ రికార్డు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు బడ్జెట్ ఊతమిస్తోంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు ఇది కొత్త శక్తిని ఇస్తుంది.

**- ప్రధాని నరేంద్ర మోదీ**



## సంక్షోభాలపై పట్టింపేది?

దేశ వాస్తవ సంక్షోభాలను కేంద్ర బడ్జెట్ పట్టించుకోలేదు. యువతకు ఉద్యోగాల్లేవు. తయారీ రంగం పతనమైపోతోంది. రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకోలేదు. పెట్టుబడిదారులు తమ పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నారు. కుటుంబాల గృహ పొదుపు తగ్గిపోయింది. ప్రపంచదేశాల నుంచి ఎదురుదెబ్బలు తగులుతున్నా విస్మరించారు.

**- ప్రతిపక్ష నేత రాహుల్**

## ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్
### సీఎం చంద్రబాబు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. కుప్పంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.



## మహిళా సాధికారతకు 'షి' మార్టులు

దేశంలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా సెల్ఫ్‌హెల్ప్ ఆంత్రప్రెన్యూర్స్ (షి) మార్టులను ఏర్పాటు చేస్తాం. లఖ్‌పతి దీదీ పథకం విజయం స్ఫూర్తితో దీనిని చేపడుతున్నాం. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో వారితోనే రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయిస్తాం. వారు ఇకపై వ్యాపారాల్లో నిర్ణయాత్మక శక్తిగా, భాగస్వాములుగా మారతారు.

## ఆహారం, ఎరువులు, ఇంధనంపై సబ్సిడీ 4.47 శాతం తగ్గింపు


ఆహారం, ఎరువులు, ఇంధనంపై 2026-27లో ప్రభుత్వ వార్షిక సబ్సిడీ వ్యయం రూ.4,10,495 కోట్లు (మైనసువీ 4.47)గా కేంద్ర బడ్జెట్‌లో అంచనా వేశారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ రంగాలపై సవరించిన సబ్సిడీ రూ.4,29,735 కోట్లు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీని రూ.2,27,629 కోట్లుగా అంచనా వేశారు. 2025-26లో సవరించిన అంచనా రూ.2,28,154 కోట్ల కంటే ఇది తక్కువ. ఎరువుల సబ్సిడీపైనా గతేడాది (రూ.1,86,460 కోట్లు)తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం (రూ.1,70,805 కోట్లు) తక్కువగానే అంచనా వేసింది. 2025-26లో పెట్రోలియం సబ్సిడీ రూ.15,121 కోట్లతో పోలిస్తే 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.12,085 కోట్లకు తగ్గించింది.

## రక్షణకు అధిక నిధులు

పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్లతోపాటు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో దేశ రక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన కేంద్రం.. బడ్జెట్‌లో ఈసారి రక్షణ శాఖకు భారీగా రూ.7,84,678 కోట్లు కేటాయించింది. ఇది మన జీడీపీలో 2 శాతానికి సమానం. రక్షణ శాఖకు నిరుడు కేటాయించిన 6.81 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి కేటాయించిన మొత్తం 15శాతం ఎక్కువ. 2026-27లో కేంద్ర ప్రభుత్వం చేసే ఖర్చులుఖ 14.67 రక్షణ వ్యయమే. ఇతర శాఖలన్నింటి కంటే అత్యధికం ఇది. కాగా.. ఈసారి రక్షణ శాఖకు కేటాయించిన రూ.7.85లక్షల కోట్లలో రెవెన్యూ వ్యయం (సైనికుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులు) రూ.3.65లక్షల కోట్లు కాగా.. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సైన్యం తక్షణ అవసరాల కోసం, యుద్ధ సన్నద్ధత కోసం మూలధన వ్యయాన్ని రూ.2.19లక్షల కోట్లుగా పేర్కొన్నారు. మూలధన వ్యయం అంటే అత్యంత అధునాతన ఆయుధాల కొనుగోలు, రక్షణ వ్యవస్థల ఆధునికీకరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని నవీకరించడం వంటివాటికి చేసే ఖర్చు. గత ఏడాది రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయానికి కేటాయించిన మొత్తం (రూ.1.8 లక్షల కోట్లు)తో పోలిస్తే ఇది ఏకంగా 24శాతం అధికం. ఇందులో రూ.63,733 కోట్లు ఎయిర్‌క్రావిఫ్టలు, ఏరో ఇంజన్ల కోసం ఖర్చుచేయనున్నారు. రూ.25,023 కోట్లు నౌకల కోసం కేటాయించారు. రూ.2,19,306 కోట్లలో.. రూ.1.85 లక్షల కోట్లు కొత్త ఆయుధాల కొనుగోలుకు.. అందులోనూ రూ.1.39లక్షల కోట్లు 'భారత్‌లో తయారీ' విధానంలో భాగంగా భారతీయ కంపెనీల నుంచి(ప్రైవేటుతో సహా) కొనుగోలు చేయడానికి కేటాయించారు. అంటే.. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, మహీంద్ర డిఫెన్స్ సిస్టమ్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ తదితర దేశీయ పరిశ్రమల నుంచే 75శాతం కొనుగోళ్లు చేస్తారు. దేశీయ పరిశ్రమలకు ఆర్డర్లు పెరగడం వల్ల అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి దారి తీసి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

## అరుదైన ఖనిజాల కోసం కారిడార్లు
### ఒడిశా, ఏపీ, తమిళనాడు, కేరళల్లో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అరుదైన ఖనిజాల విషయంలో దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా వాటిని ఉత్పత్తి చేసేందుకు కేంద్రం ప్రత్యేకంగా కారిడార్లను ఏర్పాటు చేయనుంది. ప్రత్యేక అరుదైన భౌగోళిక కారిడార్ల ఏర్పాటుకు ఖనిజాలు పుష్కలంగా ఉండే రాష్ట్రాలకు సహకరిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ కారిడార్లు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలను అనుసంధానం చేస్తాయని చెప్పారు. అరుదైన ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్, దేశీయంగా రవాణా చేయడానికి వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఈ కారిడార్లను ప్రతిపాదించారు. అరుదైన ఖనిజాలను ఆధునిక సాంకేతిక పరికరాల్లో విరివిగా వినియోగిస్తారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పవన విద్యుత్ టర్బైన్లు, మొబైల్ ఫోన్లు, రక్షణ పరికరాలకు వీటి అవసరం ఉంటుంది. అలాంటి అరుదైన ఖనిజాల నిల్వలు పుష్కలంగా ఉన్న రాష్ట్రాలను అనుసంధానం చేయడం ద్వారా సప్లయ్ చైన్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తక్కువ ఖర్చు, సులువుగా వేగంగా దేశీయ ఉత్పత్తి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నాలుగు రాష్ట్రాల్లో అరుదైన ఖనిజాల నిల్వలు ఉండటమే కాకుండా, తీర ప్రాంతం కూడా సుదీర్ఘంగా ఉంటుంది. ఖనిజాలను ప్రాసెస్ చేసే మౌలికసదుపాయాలు, ఇండస్ట్రియల్ జోన్లు, రవాణాకు అనువుగా ఉండే పోర్టులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాలకు సహకారం అందిస్తే, అరుదైన భూ ఖనిజాల ఉత్పత్తి విషయంలో దేశీయంగా ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయవచ్చని కేంద్రం విశ్వసిస్తోంది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 2 ఫిబ్రవరి 2026

## హైదరాబాద్ అనుసంధానంగా..

# హైస్పీడ్ రైల్ కారిడార్లు..

### హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెలకు హైస్పీడ్ రైళ్లు.. 300- 320 కి.మీ. వేగం

**న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**

రవాణారంగాన్ని ఉరకలెత్తించే లక్ష్యంతో దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించింది. వీటిలో మూడు కారిడార్లు హైదరాబాద్‌తోనే అనుసంధానం కావడం.. దేశ చిత్రపటంలో హైదరాబాద్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది! పుణె–హైదరాబాద్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, ముంబై–పుణె, చెన్నై–బెంగళూరు, ఢిల్లీ–వారాణసీ, వారాణసీ–సిలిగురి నడుమ చేపట్టే ఈ రైల్వే కారిడార్లు రైల్వే అనుసంధానాన్ని మరింతగా పెంచనున్నాయి. ఈ కారిడార్లను ఆర్థిక మంత్రి అభివృద్ధి అనుసంధాన కేంద్రాలుగా ప్రకటించారు. వీటివల్ల ఆయా ప్రాంతాల అభివృద్ధి మరింత వేగవంతం కావటంతోపాటు నూతన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని అంచనాలున్నాయి. గంటకు 300–320 కి.మీ. వేగంతో నడిచే బుల్లెట్ ట్రెయిన్స్‌తో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాపార తదితర అవసరాల కోసం హైదరాబాద్ నుంచి బెంగళూరుగానీ చెన్నైగానీ ప్రయాణించే వారు ఒకే రోజులో వెళ్లి పని చూసుకొని తిరిగి రావచ్చు. రైళ్లలో అధిక ప్రయాణ సమయం దృష్ట్యా.. విమానాలను ఎంచుకుంటున్నవారు ఇక మీదట హైస్పీడ్ రైళ్లలో ప్రయాణించటానికి ముందుకొచ్చే అవకాశాలున్నాయి. దీనివల్ల ప్రయాణికులకు డబ్బు ఆదా కావటమేగాక విమానాశ్రయాల మీద ఒత్తిడి తగ్గుతుంది. విమానాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలతో పోల్చితే రైళ్ల నుంచి వెలువడే ఉద్గారాలూ 80 తక్కువ. ఆ విధంగా పర్యావరణానికీ మేలు జరుగుతుంది. హైస్పీడ్ రైళ్లతో కంపెనీలు రెండో దశ (టైర్–2) నగరాలకు తమ



ఆఫీసులను తరలించుకోవటానికి అవకాశం లభిస్తుంది. ఉద్యోగులు శివార్లు, చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉంటూ మహా నగరాలకు వెళ్లి విధులు ముగించుకొని రావచ్చు. తద్వారా, మెగాసిటీలపై ఒత్తిడి తగ్గుతుంది. కాగా, ప్రతిపాదిత హైస్పీడ్ రైల్ కారిడార్లతో మధ్య, దక్షిణ భారతాన్ని అనుసంధానించే కేంద్రంగా హైదరాబాద్ మారనుంది. అంతేకాదు.. దేశ మౌలిక సదుపాయాల రంగంలో అత్యంత కీలక రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని, తద్వారా దేశ రాజకీయాల్లో కూడా రాష్ట్రానికి ప్రాధాన్యం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, టూరిజం, లాజిస్టిక్స్, ఫార్మా, ఐటీ, నిర్మాణ, నిర్వహణ, సేవల రంగాల్లో 10–15 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టవచ్చని సమాచారం. అలాగే.. జిల్లాకొక బాలిక హాస్టల్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకూ 33 బాలికల హాస్టళ్లు రానున్నాయి.కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి కొన్ని ప్రయోజనాలు దక్కినప్పటికీ.. రాష్ట్రం చేపట్టిన పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కేంద్రం నిధులు విదల్చలేదని, కొన్నింటికి సంబంధించి తాము చేసిన విజ్ఞప్తులనూ పట్టించుకోలేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు విమర్శిస్తున్నట్టు సమాచారం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో, రీజనల్ రింగు రోడ్డు, హైదరాబాద్ నుంచి అమరావతి వరకూ చేపట్టే గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగు రోడ్డు–ఔటర్ రింగు రోడ్డు మధ్య చేపట్టే రేడియల్ రోడ్లు, హైదరాబాద్, వరంగల్ నగరాల మురికి నీటి వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీల గురించి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో మచ్చుకైనా ప్రస్తావించకపోవడంపైన.. జీఎవీసడీపీలో 4 శాతం మేర మార్కెట్ రుణాలు తీసుకునేలా ఎఫ్ఆర్‌బీఎం చట్టంలో వెసులుబాటు కల్పించాలని కోరినప్పటికీ ఆ వెసులుబాటు కల్పించకపోవడంపైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో.. 4.3 శాతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటును పూడ్చుకోవడానికి మాత్రం అప్పులబాట పడతామని బడ్జెట్‌లో కేంద్రం పేర్కొనడంపై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చుతున్నట్టు తెలిసింది.

# తీరని అన్యాయం

(మొదటి పేజి తరువాయి)

ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడుతూ ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను పలుమార్లు కలిసినా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశపరిచిందని అన్నారు.

మూసీ పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ నగర అభివృద్ధికి సంబంధించి మెట్రో రైల్ విస్తరణ, ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామని చెప్పారు. బయో ఫార్మా అంటే కేంద్రానికి గుర్తు రావాల్సింది తెలంగాణ అనీ, కేంద్రం ప్రకటించిన బయో ఫార్మాలో నిధులను పొందుపరచకపోవడం తీవ్ర నిరాశపరిచిందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎలక్ట్రానిక్స్‌కు రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేశారని వివరించారు. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అన్నట్టుగా పేరుగాంచిందనీ, తెలంగాణకు ఈ విభాగంలోనూ నిధులివ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. ఫార్మా హబ్‌గా హైదరాబాద్ గుర్తింపు పొందిందనీ, కోవిడ్ సమయంలో భారత్‌కే కాకుండా ప్రపంచానికి ఔషధాలను అందించిందని గుర్తు చేశారు. ఫార్మా హబ్‌లో కూడా తెలంగాణ ప్రస్తావన లేదన్నారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగంపైన దృష్టిపెట్టిందని భట్టి అన్నారు. గ్లోబల్ సమ్మిట్–2047 విజన్ డాక్యుమెంట్‌లోనూ ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడితో క్రీడలు నిర్వహించామని చెప్పారు. క్రీడారంగంపైన ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తున్న తెలంగాణ కేంద్రానికి ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ సెంట్రిక్‌ను ముంబయికి తరలించారని అన్నారు. తెలంగాణ ఏం తప్పు చేసిందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆడియో, వీడియో, గేమింగ్ కామెక్స్ లాంటి వాటికి హైదరాబాద్ కేంద్రమని వివరించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్‌కు అన్యాయం జరిగిందన్నారు. హైదరాబాద్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లో ఇతర రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు ఎందుకివ్వలేదని అడిగారు. టూరిజం విభాగంలో కూడా తెలంగాణను పొందుపరచకపోవడం అన్యాయమని విమర్శించారు. రేర్ ఎర్త్ మినరల్స్‌లో కూడా తెలంగాణపై కేంద్రం దృష్టి సారించలేదని అన్నారు.సెమీ కండక్టర్లను మంజూరు చేయాలని మోడీని కోరినా తెలంగాణకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై ఈ బడ్జెట్ దృష్టి సారించలేదని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచిందని చెప్పారు. గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా అభివృద్ధి చేసేలా ముందుకెళ్తున్నామని అన్నారు. రాష్ట్రానికి ప్రోత్సాహం అందించకుండా కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని రాష్ట్రాలకు నాలుగు శాతానికి అవకాశమివ్వాలని కోరామని గుర్తు చేశారు. కేంద్రం మాత్రం 4.3 శాతం పెట్టుకుందని వివరించారు. భారత్‌లో తెలంగాణ అంతర్భాగం కాదా?అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక స్థితిగతులు పెంచడానికి మౌలిక సదుపాయాలు కల్పించే వీలుగా బడ్జెట్ ఉండాలని సూచించారు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అల్కరాజ్...

(మొదటి పేజి తరువాయి)

ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో వరల్డ్ నంబర్ వన్ అల్కరాజ్ 2–6, 6–2, 6–3, 7–5 తేడాతో జొకోవిచ్‌పై గెలుపొందాడు. తొలి సెట్‌లో తడబడినప్పటికీ, 22 ఏళ్ల అల్కరాజ్ అద్భుతంగా పుంజుకున్నాడు. ఆ తర్వాత వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఓటమితో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌లో జకోవిచ్‌కు తన 11 ఫైనల్స్‌లో తొలి ఓటమి ఎదురైంది. దాదాపు మూడు గంటల రెండు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ టెన్నిస్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ విజయంతో అల్కరాజ్ తన కెరీర్‌లో ఏడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఫ్రెడ్ పెర్రీ, రోజర్ ఫెదరర్, రఫెల్ నడాల్, జకోవిచ్ వంటి దిగ్గజాల సరసన కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన ఎనిమిదో ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనుకున్న 38 ఏళ్ల జకోవిచ్ నిరీక్షణ మరికొంత కాలం కొనసాగనుంది.

## రవిచంద్రకు బాధ్యతలు

(మొదటి పేజి తరువాయి)

పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. అనిల్ కుమార్ సింఘాల్‌ను తక్షణమే సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ సింఘాల్, 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు తొలిసారి టీటీడీ ఈవోగా సేవలందించారు. అనంతరం గతేడాది సెప్టెంబరులో రెండోసారి ఈ పదవిని చేపట్టారు. కేవలం ఐదు నెలల కాలంలోనే ఆయన బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ నివేదిక వచ్చిన కొన్ని రోజుల్లోనే ఈ బదిలీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మీ జంగిల్ రాజ్ భూస్థాపితం కాకతప్పదు

(మొదటి పేజి తరువాయి)

ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం సీఎంను ఉద్దేశించి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'ప్రజాస్వామ్యంలో మీరు చేసిన తప్పుడు ఆరోపణలు తప్పని ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ల్యాబ్‌లు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ నిర్ధారణ చేసిన తర్వాత, ఆ తప్పులకు మిమ్మల్ని ప్రశ్నిస్తే జీర్ణించుకోలేక అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లకు నిప్పు పెట్టడం, ఆ దుశ్చర్యలతో భయాన్ని కలిగించానని అనుకోవడం మీ భ్రమే. ఆ నిప్పు మీ ప్రభుత్వానికి మీరు పెట్టుకున్నారని గుర్తుంచుకోవాలి.' అని ఆ పోస్టులో జగన్ హెచ్చరించారు. కాగా, వైసీపీ సీనియర్ నేతలపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని మరో పోస్టులో జగన్ కోరారు. 'సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే మా పార్టీ నాయకుడు అంబటి రాంబాబు ఇంటిపైకి తెలుగుదేశం పార్టీ గూండాలు వెళ్లారు. రాంబాబుపై టీడీపీ కార్యకర్తలు గూండాల్లా హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మీ దుర్మార్గాలను ప్రశ్నిస్తే దాడులు, హత్యాయత్నం చేస్తారా? మా పార్టీ సీనియర్ నాయకులపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నా. డీజీపీ, గుంటూరు డీఐజీ, ఎస్పీతో సహా బాధ్యత వహించాల్సిన అధికారులు అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని జగన్ పేర్కొన్నారు.

# పనిచేసే వారికి పట్టం..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కుప్పంపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కుప్పంలో ఆదివారం నాడు నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను వెతుక్కుని వచ్చి గౌరవిస్తానని భరోసా ఇస్తూనే, పనితీరు మార్చుకోని నేతలకు గట్టి హెచ్చరికలు పంపారు. ఇదే సమావేశంలో, నాడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఉన్నత పదవులు వాటంతటవ అవే వస్తాయని అన్నారు. "ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకున్నా పార్టీ జెండా మోసిన షణ్ముఖ రెడ్డికి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. నిన్నటి వరకు సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయన, ఈరోజు పార్లమెంట్ అధ్యక్షుడయ్యారు. ఇదే తెలుగుదేశం పార్టీలో ఉండే గుర్తింపు" అని పేర్కొన్నారు. తన కష్టాన్ని గుర్తించినందుకు షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురై అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ని సంక్షోభాలు ఎదురైనా టీడీపీ నిలదొక్కుకోగలిగిందని, అందుకే ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజారిటీని కూటమికి కట్టబెట్టారని చంద్రబాబు అన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందని, ప్రజలతో మమేకమైతేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. "నా రాజకీయ జీవితం 2028 నాటికి 50 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రజల భవిష్యత్, వారి సంక్షేమం కోసమే నా ప్రతి ఆలోచన ఉంటుంది" అని తెలిపారు.కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఒకే సీజన్‌లో హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, లేదంటే ఈ ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని గుర్తుచేశారు. "రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి వంటి నగరాలు దేశానికి అవసరమని ఆర్థిక సర్వే కూడా చెప్పిందని గుర్తుచేశారు.

# చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్!

(మొదటి పేజి తరువాయి)

కోర్టులో తాను దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుందని ఈడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి.. తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టుచేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపునకు కారణమైన స్కిల్ కేసు కథ దాదాపు ముగిసినట్లేనని న్యాయనిపుణులు అంటున్నారు. చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేని ఈ కేసులో ఆయన్ను ఇరికించి, అక్రమంగా అరెస్టుచేసి 53 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టి.. సరైన సౌకర్యాలు కల్పించకుండా నరకయాతన పెట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన అవినీతికి పాల్పడ్డారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని, కేసును మూసివేయాలని దర్యాప్తు సంస్థ సీఐడీ కోరడంతో గత నెల 12న ఏసీబీ కోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో జగన్, వైసీపీ నాయకులు ఎంతో గగ్గోలు పెట్టారు. ఇప్పుడు ఈడీ కూడా చంద్రబాబు ప్రమేయం లేదని చెప్పడంతో వారి నోళ్లు మూతబడ్డాయి.

### ఏమిటీ స్కిల్ కేసు..

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని 2014–19 నడుమ అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు రాష్ట్ర యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,300 కోట్లుగా అంచనా వేశారు. ఈ స్కిల్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని.. రాష్ట్ర ఖజానాకు రూ.300 కోట్లు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబరు 9వ తేదీ రాత్రి చంద్రబాబుని సీఐడీ అరెస్టు చేసింది. ఈ కేసులో ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 53 రోజులు గడిపారు. 2023 అక్టోబరు 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు.. ఈ కేసులో ఈడీ అంతకుముందే విచారణ మొదలుపెట్టింది. రాష్ట్రప్రభుత్వాన్ని మోసం చేసి.. సీమెన్స్ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను ఇతర ప్రయోజనాలకు మళ్లించి దుర్వినియోగం చేశారని సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో డీటీఎవీసపీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ ఖన్వేల్కర్, సీమెన్స్ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్, వారి అనుచరులు ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్.. షెల్ కంపెనీలను సృష్టించి తప్పుడు ఇన్వాయిసీసల ఆధారంగా ప్రభుత్వ నిధులను మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. ఇందుకు ఎంట్రీ ప్రొవైడర్ల సేవలు తీసుకుని కమీషన్లు చెల్లించినట్లు వెల్లడైంది.

ఈ కేసులో వికాస్, సుమన్ బోస్, అగర్వాల్, సురేశ్ గోయల్‌ను ఈడీ 2023 మార్చి 4న అరెస్టు చేసింది. 2023 ఏప్రిల్‌లో డిజైన్‌టెక్ సిస్టమ్స్ పేరిట ఉన్న రూ.31.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేసింది. అనంతరం విశాఖలోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా.. అదే ఏడాది మే నెలలో కోర్టు దానిని పరిగణనలోకి తీసుకుంది. తదుపరి దర్యాప్తులో ఎంట్రీ ప్రొవైడర్లకు సంబంధించిన బ్యాంకు బ్యాలెన్సులు, షేర్లను.. ఢిల్లీ, ముంబై, పుణే ప్రాంతాల్లోని స్థిరాస్తులను కలిపి రూ.23.54 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దీంతో ఈ కేసులో మొత్తం జప్తుచేసిన ఆస్తుల విలువ రూ.54.74 కోట్లకు చేరింది. గత నెల 28న దాఖలుచేసిన అనుబంధ చార్జిషీటులో డిజైన్‌టెక్ సిస్టమ్స్, వికాస్, సుమన్ బోస్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్ తదితరులను నిందితులుగా ఈడీ పేర్కొంది. ఇందులో ఎక్కడా చంద్రబాబు ప్రస్తావన లేదు. ఆయన ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చూపలేమని స్పష్టం చేసింది. తదుపరి దర్యాప్తులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తే తప్ప.. ఈ అనుబంధ చార్జిషీటే ఈ కేసులో చిట్టచివరిదని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.

## అంబటి కి 14 రోజుల రిమాండ్

(మొదటి పేజి తరువాయి)

లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ అంశంపై 'మహాపాపం' పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లిన అంబటి రాంబాబు.. 24 గంటల్లో ఫ్లెక్సీ తొలగించాలని హెచ్చరించారు. శనివారం ఉదయం గోరంట్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం అదే మార్గంలో కారులో వెళ్తుండగా టీడీపీ శ్రేణులు అంబటిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆగ్రహించిన అంబటి రాంబాబు కారులో నుంచే తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు కారులో ఉన్నవారు వీడియోగా రికార్డు చేయడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కూటమి శ్రేణులు కారుపై కర్రలు, పిడిగుద్దులతో దాడి చేశాయి. అక్కడి నుంచి వెళ్లాలని పోలీసులు సూచించినా అంబటి వినిపించుకోకుండా మళ్లీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కారులో నుంచి దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు అద్దం దించి సీఎం చంద్రబాబుపై తీవ్ర పరుష పదజాలంతో దూషించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. గుంటూరు సిద్ధార్థనగర్‌లో అంబటి రాంబాబు నివాసం, కార్యాలయంపై శనివారం సాయంత్రం దాడులు జరగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంబటిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ పలుచోట్ల పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నల్లపాడు ఎస్సై కె. రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అంబటిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో ఆయనను అరెస్టు చేశారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు ఆయనను తరలించారు. విచారణ, వైద్య పరీక్షల అనంతరం ఆదివారం రాత్రి న్యాయాధికారి ముందు అంబటిని పోలీసులు హాజరుపర్చగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయాధికారి ఆదేశాలతో అంబటి రాంబాబును పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్

## మీ ఆదేశాలతోనే ట్యాపింగ్ జరిగిందా?

(మొదటి పేజి తరువాయి)

నివాసంలో ఆయన్ను నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో ఇంటి బయట వేలాది మంది కార్యకర్తల నిరసనలు, నినాదాలు చేశారు. భారీ బందోబస్తు మధ్య ఆరుగురు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణ పర్వం పూర్తిగా వీడియో రికార్డింగ్ చేశారు. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు నేరుగా సమాధానమిచ్చిన కేసీఆర్ మరికొన్నింటికి ఎదురు ప్రశ్నించారు. ఒక సందర్భంలో ఇదంతా సిల్లీ వ్యవహారమనీ, కేవలం రాజకీయ కక్షతోనే సాగిస్తున్న డ్రామా అంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకుడ కేసీఆర్ ఆదివారం భారీ కాన్వాయ్ తో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నందినగర్ నివాసానికి చేరుకున్నారు.ఇతరులు అటువైపు రాకుండా కె+సీఆర్ నివాస పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ కమాండెంట్ రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితురాజ్, శంషాబాద్ అదనపు ఎస్పీ ఎఎస్ రావు, ఏసీపీలు శ్రీధర్ రికార్డింగ్ పరికరాలతో ఆయన నివాసానికి చేరుకున్నారు. రెండో అంతస్తులో వెయిట్‌చేస్తున్న సిట్ అధికారుల వద్దకు న్యాయవాదులతో కలిసి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో కేసీఆర్ వచ్చారు. విచారణ గదిలోకి న్యాయవాదులను అనుమతించ లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు మొదటి అంతస్తులో ఉండి పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్నం 3.10గంటలకు విచారణ ప్రారంభించారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు మీకు ముందుగానే తెలుసా..? మీకు అవసరమైన వ్యక్తుల సమాచారం కోసం వారి ఫోన్లు ట్యాపింగ్ చేయమని అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఆదేశించారా? ఈ విషయంలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును కూడా ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలతో అధికారులు విచారణను ప్రారంభించినట్టు తెలిసింది.అయితే, ఉదయమే ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంగా ఉన్న తనను కలిసి శాంతిభద్రతల సమాచారం చెప్పేవారనీ, ఆ సమాచారం ఎలా సేకరించారనే విషయం తనకు అప్రస్తుతమని కె+సీఆర్ చెప్పినట్టు తెలిసింది. దేశ భద్రత, ప్రభుత్వ సుస్థిరత, మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తుంటారు. అది వారి విధుల్లో భాగమని మీకు తెలియదా? అని అడగ్గా కె+సీఆర్ సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. సుప్రీం నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు గతంలో తాము అరెస్ట్ చేసి విచారించిన అధికారులు తెలిపిన విషయాన్ని వివరిస్తూ ..ఆ సుప్రీం మీరేనా? అని కేసీఆర్‌ను ప్రశ్నించగా దానికి ఆయన నేరుగా సమాధానమివ్వలేదని సమాచారం.కాగా, బీఆర్ఎస్ పార్టీకి రూ.1100కోట్లకుపైగా నిధులు వ్యాపారులను బెదిరించి ఎలక్ట్రోరల్ బాండ్లు వసూలు చేశారన్న ప్రశ్నలకు కూడా ఆయన సమాధానం ఇవ్వలేదు. కాగా, ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారమనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యల్లో భాగంగా సాధారణంగా నిర్వహించే వ్యవహారమని కేసీఆర్ వాదించినట్టు తెలిసింది. గతంలో సిట్ సేకరించిన సమాచారం, పలు ఆధారాలను కేసీఆర్ ముందుపెట్టి ప్రశ్నించారు. మధ్యలో విరామమిస్తూ రాత్రి 7.45నిమిషాల ప్రాంతంలో విచారణను ముగించి స్టేట్‌మెంట్‌పై కేసీఆర్ సంతకం తీసుకున్నట్టు తెలిసింది. రాత్రి 8గంటల ప్రాంతంలో సిట్ అధికారులు కేసీఆర్ నివాసం నుంచి వెళ్లిపోయారు. కిందికి వచ్చిన కేసీఆర్ అక్కడే ఉన్న కేటీఆర్, హరీశ్‌రావుతో సమావేశమయ్యారు.

# హరిణ వనస్థలిలో ఉత్సాహంగా 5కే రన్

## పాల్గొన్న యువతి యువకులు,సీనియర్ సిటీజన్స్




**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): ఫిబ్రవరి1**
హాబ్సిగూడా స్ట్రీట్ నెంబర్ 8 వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో 5 కే రన్ ను నిర్వహించారు.ఈ 5కే రన్ లో సుమారుగా 200 మందికి పైగా వాకర్స్ పాల్గొన్నారు.ఈ 5కే రన్ లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.ప్రతి ఒక్కరికి ఫిట్నెస్ హెల్త్ మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈవెంట్ ఆర్గనైజర్ ఎన్వీ రమణారావు పేర్కొన్నారు.ఈ 5కే రన్ లో 6 సంవత్సరాల చిన్నారుల నుండి 79 సంవత్సరాల సీనియర్ సిటీజన్స్ పాల్గొన్నారు.గత మూడు సంవత్సరాల నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎన్వి రమణ రావు అన్నారు.ఇలాంటి పార్కుల్లో 5కే నిర్వహించడం వల్ల మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈవెంట్ స్పాన్సర్ గా ఎల్వీ రెడ్డి,డిఎఫ్ ఓ శంకరన్,బాల్ రెడ్డి, శివ శంకర్ నాయుడు, శ్రీనివాసరెడ్డి,వాకర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భూనీళ వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఫిబ్రవరి1,రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలోని వెంకటేశ్వరా స్వామి కల్యాణ మహోత్సవంను వైభవంగా నిర్వహించారు.ఈ కల్యాణ మహోత్సవంలో గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామి వారి కల్యాణ కార్యక్రమంను నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పాల్గొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా స్వామి వారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని దేవాలయ కమిటి చైర్మన్ కొంద్ర ఎల్లమయ్య తెలిపారు.కోరిన కోరికలు తీర్చే వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ ఉండాలన్నారు.

# ఇది సంస్కరణల ఎక్స్‌ప్రెస్!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 01,ప్రజావినికిడి** :ఈ బడ్జెట్ 'సంస్కరణల ఎక్స్‌ప్రెవీస' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. రక్షణ రంగాన్ని మరింత శక్తిమంతం చేసుకుంటూ.. రైల్వే, ఫార్మా, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి రంగాలకు ప్రాధాన్యం లభించిందనిచెప్పారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు ఈ బడ్జెట్ తొలి అడుగు అని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు మేలు కలుగుతుందన్నారు. తెలంగాణకు 2025-26లో పన్నుల వాటాగా రూ.29,280కోట్లు రాగా 2026-27లో 13.5శాతం పెరుగుదలతో రూ.33,180కోట్లు వస్తాయని తెలిపారు. 7 హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటిస్తే అందులో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభమవుతున్నాయని గుర్తుచేశారు. బయోఫార్మా శక్తి పథకం ద్వారా ఫార్మా, టీకాల రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు మరింత లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎరువుల సబ్సిడీలో సింహభాగం తెలంగాణకే కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాలకు ఒక్కో బాలికల హాస్టల్ రానుందన్నారు.

# దేశీయ తయారీ రంగానికి ఊతం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



హైదరాబాద్, **ఫిబ్రవరి 01,ప్రజావినికిడి** వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఈ బడ్జెట్ వికసిత్ భారత్ నిర్మాణ ఆశయంగా మాత్రమే కాకుండా వాస్తవంగా మారే దిశగా దేశాన్ని ముందుకు నడిపించేలా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ గర్వకారణమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడుతుందని తెలిపారు. ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్ అని, ఆర్థిక బలం నుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణయాత్రకు ఈ బడ్జెట్ బాటలు వేస్తుందన్నారు. దేశీయ తయారీ రంగానికి ఊతమివ్వడంతోపాటు ఇంధన భద్రతను బలోపేతం చేస్తుందని, దిగుమతులపై ఆధారపడే విధానంలో మార్పు వస్తుందని వివరించారు. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్య, వైద్య సేవల విస్తరణకు బడ్జెట్ బలమైన పునాది వేస్తుందన్నారు. ప్రధాని మోదీకి, నిర్మలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా

# పలు కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణం

## - స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి





**ప్రజావినికిడి ,(ఎల్బీనగర్):**
ఆదివారం రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా పలు కాలనీలలో నిర్వహించిన సి.సి రోడ్ల ప్రారంభం శంకుస్థాపన కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది.
శ్రీపురం కాలనీ లో 37.00 లక్షల రూపాయలతో సిసి రోడ్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు. శ్రీపురం కాలనీ ఫేస్ 2 లో 18.00 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది.శ్రీపురం కాలనీ ఫేస్ 1 లో 21.00 లక్షల రూపాయలతో ఓపన్ జిమ్ పిల్లల ఆట పరికరాలు పరికరాలు ఏర్పాటు చేయడం జరిగింది.పద్మావతి కాలనీలో 22 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ చేపట్టడం జరిగింది.శ్రీ వీరాంజనేయ కాలనీలో 34 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధి కొరకు పలు కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని,త్వరలోనే పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపడతామని మరియు దశలివారీగా డివిజన్లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తున్నామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ముత్యం రావు, శ్రీధర్ రెడ్డి,రాజు గౌడ్, సత్యనారాయణ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నారాయణరెడ్డి,
విట్టల్ రెడ్డి,సికిందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,డాక్టర్ బృంగి శిరీష్ కుమార్,రాజేందర్ రెడ్డి,వెంకటరమణ రెడ్డి,రాజేందర్, వెంకటేశ్వరరావు, దయాకర్ దామోదర్ రావు, సిహెచ్ శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,సురేందర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,రామయ్య, కిషన్,సుభాష్, రఘు రామారావు, కిరణ్ కుమార్,మధన్ మోహన్, సాయికుమార్, పాండురంగారావు, ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, సాయికుమార్, రామ్ మోహన్ రావు,నరేష్ రెడ్డి, సురేష్ రెడ్డి నరహరి,నరేష్, రామయ్య, సుధాకర్ రావు, శివ శంకరయ్య, రెహమాన్,ఖాదర్ బాషా, సత్యనారాయణ రెడ్డి,అనిల్ కుమార్,బాబు, రమేష్,శ్రీ వాత్సవ, ఫణిందర్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి,ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, బిజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్,ఎస్సీ మోర్చా సెక్రెటరీ దుర్గాప్రసాద్ మరియు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

# 2026 -27 చరిత్రాత్మక అభివృద్ధి బడ్జెట్

**బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో, కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 202627 కేంద్ర బడ్జెట్ దేశాన్ని వికసిత భారత్ 2047 లక్ష్యానికి తీసుకెళ్లే చరిత్రాత్మక అభివృద్ధి బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి అన్నారు.ఈ బడ్జెట్‌లో మొత్తం వ్యయం.. ₹3.47లక్షల కోట్లకు పైగా
మౌలిక వసతుల (క్యాపిటల్ ఎక్స్పెండిచర్) కోసం భారీ కేటాయింపులు రక్షణ రంగానికి సుమారు ₹.66 లక్షల కోట్లువ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి లక్షల కోట్ల రూపాయల నిధులుఆరోగ్యం,విద్య, స్కిల్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యతఇవన్నీ కలిపి ఇది మాటల బడ్జెట్ కాదు పని చేసే బడ్జెట్ అని స్పష్టమవుతుందన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని గత ప్రభుత్వాలకు భిన్నంగా,మోదీ ప్రభుత్వం మందుల ధరలు తగ్గిస్తూ 'ఆరోగ్య భారత్'దిశగా గట్టి అడుగులు వేసిందని తెలిపారు.ఇది సామాన్యుడికి నేరుగా లాభం చేకూర్చే నిర్ణయమన్నారు.
యువత కోసం స్కిల్ డెవలప్మెంట్, సాంకేతిక విద్య, ఉద్యోగాల సృష్టి, అలాగే ఎంఎస్ఎంఈ లు,స్టార్టప్స్, పారిశ్రామిక రంగానికి బలమైన మద్దతు ఇవ్వడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు తీసుకెళ్లే బడ్జెట్ ఇదని అన్నారు.
తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా రోడ్లు, రైల్వేలు,పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధికి భారీ పెట్టుబడులు కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తోందన్నారు. కేంద్రం వివక్ష చూపుతోందన్న విమర్శలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసిన అబద్ధాలేనని స్పష్టం చేశారు.మొత్తంగా,₹3 లక్షల కోట్లకు పైగా వ్యయంతో,రక్షణవ్యవసాయం,ఆరోగ్యం, విద్య,యువత,మౌలిక వసతులు అన్నీ కవర్ చేస్తూ,
ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తును నిర్మించే మోదీ గ్యారంటీ బడ్జెట్ అని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

# దేశం ఒక యూనిట్ గా అభివృద్ధి ప్రధాన ఎజెండాగా 2026 భారతదేశ బడ్జెట్..

**సామ రవీందర్ రెడ్డి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**



**ఫజావినికిడి,(షాద్ నగర్):** భారతదేశంలో 80వ బడ్జెట్ గా పేర్కొంటున్న, కర్తవ్య భవన్ లో రూపొందించిన మొట్టమొదటి బడ్జెట్ గా, తొమ్మిదవ సారి భారతదేశ ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్.
ఏడు శాతం వృద్ధి తో ముందుకెళ్తున్న భారతదేశమని చెప్పిన కేంద్రం.దీని ద్వారా ప్రపంచ దేశాలకు గట్టి ఆర్థిక వ్యవస్థ అని చెప్పింది అనడంలో, పెట్టుబడులను తెస్తుంది అనడంలో సందేహం లేదు.
వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ ను తెచ్చిన కేంద్రం.
పట్టణీకరణకు అధిక ప్రాముఖ్యమిచ్చి టైర్ టూ,టైర్ త్రీ పట్టణాలకు అందులో మౌలిక సౌకర్యాలను పెంచి భారతదేశాన్ని పట్టణీకరణ వైపు పట్టాలు వేసిన కొత్త కేంద్ర బడ్జెట్.
పారిశ్రామికంగా అభివృద్ధి చెందడమే ధ్యేయంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలను పెంచే లక్ష్యంతో ఎం ఎస్ ఎమ్(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ ) లకు భారీ సపోర్టు.
దీంతో పట్టణాల వలసలకు ఎక్కువ ఉపాధిని కల్పించి పేదరికం తీసివేసే యోచనలో కేంద్రం.
దాదాపు 25 కోట్ల మంది ప్రజలు బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని, ఇంకా పేదరికం తగ్గించి బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలని వ్యూహాత్మక బడ్జెట్ ను ప్రవేశపెట్టింది.
ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యక్తిగతా నికి తావివ్వకుండా ప్రాంతీయ భేదాలకు తావు లేకుండా దేశం ఒక యూనిట్ గా కేటాయింపులు జరిపారు.
ఆదాయ పన్ను చెల్లించే వారికి కొంత వెసులుబాటు కనిపించింది.
తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులతో కేంద్ర బడ్జెట్ లక్ష కోళ్ల గ్రాంట్స్ తో హైదరాబాద్లో రెండో ఫేస్ మెట్రో రైల్ విస్తరణకు ఓకే అన్న కేంద్రం. బయో ఫార్మా శక్తి కేంద్రం కోసం పదివేల కోట్లను కేటాయించిన కేంద్రం,త్రిబుల్ ఆర్ దక్షిణభాగానికి క్లియరెన్స్ ఇచ్చింది ఈ బడ్జెట్.దేశంలో అ నాఆర్గనైజ్డ్ సెక్టార్ లో ఎక్కువ ఉపాధి కల్పించే టెక్స్టైల్ రంగానికి ప్రాముఖ్యం ఇచ్చి పరోక్షంగా పత్తి పంట వ్యవసాయదారులకు ఆదాయం మార్గాన్ని పెంచింది.
అలాగే రైతులకు కిసాన్ వడ్డీ రాయితీ మూడు శాతం నుంచి ఐదు శాతానికి పెంచడం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచడం రైతులకు వరమనే చెప్పవచ్చు.
ఐటీ చట్టానికి ఇంకా పదును పెడుతున్న కేంద్రం
సెల్ఫ్ హెల్ప్ ఎంటర్ప్రూనర్ పేరుతో (షి-మార్ట్ లు) పెట్టడం ఉపాధి వర్గానికి పెద్ద పీట వేస్తుంది అనే సంకేతాలు ఇచ్చింది.
పోస్టల్ వ్యవస్థకు కూడా ఊతమిచ్చే విధంగా లాజిస్టిక్ వ్యవస్థగా ఇండియన్ పోస్టల్ వ్యవస్థను మార్చబోతుంది.
వ్యక్తిగతమైన అత్యంత భారంగా పరిణించే క్యాన్సర్ లాంటి మందులపైన ఇరవై నుంచి పది శాతం సుంకాలు తగ్గించడం బాధితులకు ఊరటనే..కానీ సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్ ను పెంచడం వల్ల ఈ రోజే అనేక ఒడి దుడుకులు స్టాక్ మార్కెట్లో కనిపించాయి.
ఏది ఏమైనా ఈసారి బడ్జెట్ దేశాన్ని బలోపేతం చేసే విధంగా ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా బడ్జెట్ కనిపించింది అనడంలో సందేహం లేదు.

## శివశక్తి అకాడమీ మెగా డ్యాన్స్ ఈవెంట్ లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన

# స్మరణ డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణులు







**ప్రజావినికిడి, (ఘట్ కేసర్):**
రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ లోని సమతామూర్తి ప్రాంగణంలో 1008 మంది నృత్యకారులతో శివశక్తి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్లాసికల్ డ్యాన్స్ ఈవెంట్ లో స్మరణ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఇళయరాజా రూపొందించిన మెర్క్యురీ ఫౌండేషన్ దివ్య ప్రచుర్యన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుండి 1008 మంది క్లాసికల్ డ్యాన్సర్లు ఏకకాలంలో ప్రదర్శన చేశారు. ఇందులో భాగంగా స్మరణ డ్యాన్స్ అకాడమీ నుండి అరవై మంది నృత్య కళాకారులు మెగా ఈవెంట్ లో అత్యుత్తమంగా తమ ప్రతిభను ప్రదర్శించడంతో ఆహూతుల అభినందనలను చూరగొన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ చిన జీయర్ స్వామి ప్రత్యేకమైన ఆశీస్సులు అందజేసి స్మరణ డ్యాన్స్ అకాడమీ నృత్య గురువు ప్రియాంక కృష్ణ చైతన్య ను ప్రత్యేకంగా అభినందించి పార్టిసిపెంట్ సర్టిఫికేట్, మొమెంటో లను అందజేశారు.

## ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్

# నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్..

**బడుగు,బలహీన వర్గాల జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే మొదటి లక్ష్యం.. : వడ్డేపల్లి కిషోర్..**





**ప్రజావినికిడి, (ఉప్పల్):**
ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన అధ్యక్షుడు గా సీనియర్ జర్నలిస్టు వడ్డేపల్లి కిషోర్ ఎన్నికయ్యారు. ఉప్పల్ లో సీనియర్ జర్నలిస్టులు కడారి బాలేశం, చంద్రమౌళి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షుడుగా వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి లుగా ఆనంద నర్సింహరెడ్డి, పెంబల్ల కుమార్ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా కొలనుపాక చంద్రమౌళి , సలహాదారులుగా కడారి బాలేశం, మాటూరి శ్రీనివాస్,మచ్చ శ్రీహరి,కంచు శ్రీనివాస్,డి. సురేష్,పారెల్లి సాగర్,పబ్బు రాజశేఖర్, గౌరవాధ్యక్షులుగా ఓంకారం సంతోష్ రాజు,వర్కింగ్ ప్రెసిడెంట్ గా పయ్యావుల సంతోష్,డిప్యూటి జనరల్ సెక్రటరీగా సీసా నాగరాజు , ఉపాధ్యక్షులుగా బోడ ప్రవీణ్, కందుకూరి ప్రశాంత్,గోరుకంటి నరేందర్,దొంతు స్టాలిన్, కోశాధికారులు గా ఆర్.యాదగిరి, సారా వెంకటేష్ గౌడ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి లుగా పి.తిరుమల్ రెడ్డి , కొయ్యేడి కరుణాకర్, ఎడపాక సురేష్ , దొడ్డి శోభన్, శ్రవణ్,జాయింట్ సెక్రటరీ లుగా దత్రపు దేవా,బల్ల సూర్యం,ప్రవీణ్, కె.జీవన్ గౌడ్ సాంస్కృతిక కార్యదర్శి లుగా పబ్బు కిరణ్, ఉపేందర్,షేక్ పాషా లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు గా వడ్డేపల్లి కిషోర్ మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గంలో ప్రింట్ మీడియా అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యలను నిస్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం అందిస్తూ, మీడియా వృత్తికి గౌరవం తీసుకొచ్చేలా నూతన కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బి.వి.రాజు, ఇందూరివిష్ణు, లక్ష్మణ్,వెంకట్ రెడ్డి,సోనిశ్రీ, ప్రసాద్, చంద్రశేఖర్, అరుణ్,శ్రీకాంత్, శ్రీధర్,సిద్దు, జి.వెంకటేష్, సి.చరేష్,డి.శివ తదితరులు ఎన్నికయ్యారు.

## అంగరంగ వైభవంగా

# శ్లోక స్కూల్ వార్షికోత్సవ వేడుకలు






**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): ఫిబ్రవరి, 1,**
మనసూరాబాద్ లోని శ్లోక స్కూల్ వార్షికోత్సవ వేడుకలు మనసూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్ లో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విభిన్న వేషధారణతో నృత్య ప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విద్యావేత్త, ఉద్యమకారుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఏం కోదండరాం హాజరై దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు తనను ఎంతో ఆశ్చర్యానికి గురి చేశాయని తెలిపారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చదువు గొప్పతనాన్ని వివరిస్తూ చదువుతోనే ఏదైనా సాధ్యమని అన్నారు.దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు చదువు ఒక్కటే ఆధారమని విద్యార్థులకు సూచించారు.శ్లోక స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ చింతల సంగమేశ్వర గుప్త,డైరెక్టర్ చింతల వీణ సంగమేశ్వర గుప్తా,చైర్మన్ బిట్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ బిట్ల శైలజ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా విద్యా సంస్థ ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి,క్యాంపస్ ఇంచార్జ్ ప్రమోదరెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం,సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

## భారతీయ యోగ సంస్థాన్ ఆధ్వర్యంలో

# ఘనంగా వసంత ఉత్సవ్




**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**భారతీయ యోగ సమస్తాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఈస్ట్ వెస్ట్ లో గత కొన్ని సంవత్సరాల నుండి ఉచిత యోగ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినారు. ఈ కేంద్రాలలో ప్రతిరోజు ఉచితంగా యోగ సాధకులకు యోగ నేర్పడం జరుగుతుంది. దీనిలో భాగంగా భారతీయ యోగా సంస్థ వారు లోయర్ ట్యాంక్ బండ్ గోశాల ప్రాంగణం లో ఏర్పాటు చేసిన వసంతోత్సవ్ లో ప్రెస్ కాలనీ పార్క్ యోగ మహిళ సాధకులు చంపాపేట్ డివిజన్ ప్రెస్ కాలనీ యోగ ఛీఫ్ లక్కి మాధవరెడ్డి ఆదేశానుసారం తో పాల్గొని తెలంగాణ బతుకమ్మ ఫేమస్ పాట తెలంగాణలో పుట్టి పుల పల్లకి ఎక్కి అనే పాటతో నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరంతెలంగాణ ఈస్ట్ ప్రెసిడెంట్ కులకర్ణి మాట్లాడుతూ, భారతీయ యోగా సమస్తాన్ వసంతోత్సవ్..యోగ సమస్తాన్ ఆధ్వర్యంలో వసంతోత్సవ్ ఘనంగా నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ వసంత ఉత్సవ్ కార్యక్రమానికి నగరంలో నిర్వహించే వివిధ ప్రాంతాల నుండి ఎంతోమంది యోగ శిక్షకులు సాధకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భారతీయ యోగా సమస్తాన్ సభ్యులు. డిస్టిక్ త్రీ ప్రెసిడెంట్ బి.కృష్ణయ్య, సెంటర్ ఇంచార్జి కాయితి లక్ష్మరెడ్డి, యోగ సాధకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జయంత్ గుప్తా జన్మదిన వేడుకలకు

# హాజరైన కార్పొరేటర్ రంగా



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**చైతన్యపురి డివిజన్ బీజేవైఎం ప్రెసిడెంట్ జయంత్ గుప్తా జన్మదిన వేడుకలు కాలనీవాసుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన వేడుకలకు స్థానిక కార్పోరేటర్ రంగ నరసింహ గుప్త హాజరై జయంతి గుప్తకు శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు డివిజన్ భాజపా కార్యకర్తలు స్నేహితులు కేకును కట్ చేయించారు. శాలువతో ఘనంగా సత్కరించారు. జయంత్ గుప్తా అనంతరం మాట్లాడుతూ, కాలనీవాసులు కార్యకర్తల స్నేహితుల మధ్య తన జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాలనీవాసులు కార్యకర్తలు స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వినోద్ యాదవ్, నవీన్ యాదవ్, రుద్రారపు శంకర్, శ్రీనివాస్, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): ఫిబ్రవరి1,**
తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కెసిఅర్) పై రాజకీయ కక్షలతో, అక్రమ కేసులో అక్రమ నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచినందుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వికృత చేష్టలకు నిరసనగా, ఆదివారం రోజు పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమంలో చైతన్యపురి జాతీయ రహదారి పై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిన్నారం విఠల్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,శివ ప్రకాష్, ఎస్. నాగలక్ష్మి,త్రివేది, రాపోలు సుధాకర్, పవన్,గట్టు సీను,చిన్న యాదవ్, అజయ్,రవి యాదవ్ జలంధర్, ప్రవీణ్, కిరణ్,సాయి,శ్రీశైలం యాదవ్, నరేష్,చక్రం నాగరాజు,వీరన్న యాదవ్,శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):**మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీ రాజ రాజేశ్వరి కాలనీ ఫేస్.2 కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీవాసులు తమ స్వంత నిధులతో ఈ కమ్యూనిటి హాల్ నిర్మించుకోవడం జరిగింది అని అన్నారు.అలాగే మరో అదనపు అంతస్తు కోసం నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,శ్రీధర్ గౌడ్,కోసనం వెంకట్ రెడ్డి,జక్కిడి రఘువీర్ రెడ్డి,భాస్కర్ సాగర్,అనిల్ కుమార్ కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక నిధులు కేటాయించి కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తా..

### ఎల్బీ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి మధు మధు యాష్కి గౌడ్..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్): ఫిబ్రవరి 1,**ప్రతి కాలనీల లోని అభివృద్ధిలో సంక్షేమ సంఘ ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని టీపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ ఎల్బీ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి మధు యాష్ కిగౌడ్ అన్నారు. ఆదివారం నాడు టీపిసి సి ప్రచార కమిటీ చైర్మన్ ఎల్బీ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి మధు యాష్ కి గౌడ్ ని ఆయన కార్యాలయంలో జక్కిడి రామస్వామి రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకముగా కలవడం జరిగింది. సౌభాగ్య నగర్ మాజీ ప్రెసిడెంట్ నందకిషోర్ బృందావన్ మెడోస్ కాలనీ ప్రెసిడెంట్ పొనుగుపాటి శశికాంత్,జనరల్ సెక్రటరీ వేణు కలిశారు.బృందావన్ మెడోస్ కాలనీ డ్రైనేజీ సబ్లైన్స్ సీసీ రోడ్స్ గురించి చర్చించారు.ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, అన్ని కాలనీలలో ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# డొల్ల కేసు అని తేలింది

హైదరాబాద్: **ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదని, తమ ప్రభుత్వం ఏ తప్పూ చేయలేదని ఈరోజు(ఆదివారం)తో తేలిపోయిందని బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పారు. ఇది కేవలం ప్రభుత్వ అధినేతల పైశాచికానందం, ఇందులో ఏమీ లేదని సిట్ అధికారులు కూడా అర్థమైపోయిందని, దీంతో ఇక్కడితో ఈ కేసుకు ఫుల్‌స్టాప్ పడుతుందని భావిస్తున్నామని అన్నారు.
సిట్ విచారణ అనంతరం కెసిఆర్ ఎర్రవెల్లికి వెళ్లిన తర్వాత నందినగర్ నివాసంలో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులు తేలేమని బిజెపి, కాంగ్రెస్ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకుందుకే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే కెసిఆర్‌ను విచారణను పిలవడంతో ఆం తర్యం అదేనని ఆయన ఆరోపించారు. కెసిఆర్ మీద బురదజల్లడం అంటే సూర్యుడిపైన ఉమ్మేసినట్లే అవుతుందని ఇప్పటికైనా అర్థమై ఉంటుందని అన్నారు. సిట్ విచారణకు కెసిఆర్ హాజరు కావాల్సిన అవసరం లేకపోయినప్పటికీ చట్టాన్ని గౌరవించే బాధ్యతాయుతమైన పౌరుడిగా సిట్ అధికారులకు కెసిఆర్ పూర్తిగా సహకరించారని తెలిపారు. ఆయనను అడిగిన ప్రశ్నలకు కుండబద్దలు కొట్టినట్లుగా సమాధానం చెప్పి సిట్ అధికారుల కళ్లు తెరిపించారని చెప్పారు. సిట్ ఎవరి నేతృత్వంలో నడుస్తుందని ప్రశ్నించారు. సిట్ నేతృత్వం వహించేది మహేష్‌కుమార్ గౌడ్..? అధికారులా..? అంటూ ఎద్దేవా చేశారు.
చట్టం ముందు అందరూ సమానమే అని, విచారణ చేస్తే ఆందోళన చేస్తారా..? అని పిసిసి ఛీఫ్ ప్రశ్నిస్తున్నారని, మరి ఇడి కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను విచారిస్తే మీరెందుకు వెళ్లి రాజ్‌భవన్ ముందు ఆందోళనలు చేశారని నిలదీశారు. తెలంగాణ ప్రజలచేత రెండు సార్లు ఎన్నుకోబడిన పాపులర్ సిఎం, రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు కెసిఆర్‌ను వేధిస్తే కాళోజీ నారాయణరావు చెప్పినట్లు ఉక్కుపాతరేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పట్టించుకునే నాయకుడే లేరని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఛార్టెడ్ ఫ్లైట్లలో చెక్కర్లు కొడుతూ గాలి తిరుగుడు తిరుగుతున్నారని, ఆ డబ్బులు ఎవడి అబ్బ సొమ్మని ఆయన ధ్వజమెత్తారు. ఒకవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పట్టపగలు కోఠిలో కాల్పులు జరిగాయి, మరోవైపు గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్‌పై కారు ఎక్కించి చంపేశారని, రెండో కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన సమ్మక్క సారక్క జాతర అధ్వాన్న ఏర్పాట్లతో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, వాటిని పట్టించుకునే నాథుడు లేడు, మంత్రులకు సోయి లేదని తీవ్ర విమర్శలు చేశారు.

# ఖానాపూర్‌లో చిరుతల సంచారం




ఖానాపూర్ పరిసరాల్లోని నాలుగు కిలోమీటర్ల పరిధిలో 15 నిమిషాల వ్యవధిలో రెండు చిరుతల సంచారం శనివారం రాత్రి కలకలం రేపింది. ఖానాపూర్‌ను ఆనుకునివున్న కొమురం భీమ్ చౌరస్తా నుంచి తర్లపాడు మధ్య అటవీ ప్రాంతంలో రాత్రి 8:30 సమయంలో ఓ చిరుత రోడ్డు దాటడానికి ప్రయత్నించగా నిర్మల్ వైపు నుంచి కడెంకు వెళ్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. 15 నిమిషాల వ్యవధిలోనే ఖానాపూర్ నుంచి దిలావర్‌పూర్ మీదుగా సత్తెనపల్లి వెళ్లే రహదారి ఆనుకొనివున్న పంట పొలంలో మరో చిరుత కనిపించి కలకలం సృష్టించింది. దిలావర్‌పూర్‌కు చెందిన మంగతార అనే మహిళా రైతు.. తన పంట చేలో తరుచుగా వ్యవసాయ పనిముట్లు చోరీకి గురవుతుండటంతో రక్షణ కొరకు 8 సీసీ కెమెరాలు అమర్చారు.
శనివారం రాత్రి 9 గంటలలోపు మంగతార అనే రైతు పంట చేనులో చిరుత సంచరించడంతో పక్కనే ఉన్న రైతులు భయాందోళనకు గురయ్యారు. చిరుత కనిపించడంతో రాత్రిళ్లు పంట చేనుకు కాపలాలకు వెళ్లే రైతులు జంకుతున్నారు. కొమురం భీమ్ చౌరస్తా సమీపంలో చిరుత కనిపించడంతో అక్కడ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న స్టాటస్టిక్స్ సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. సిబ్బంది అడవిలో రోడ్డుపై టెంట్లు వేసుకొని ఎన్నికల తనిఖీ విధులు నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి చిరుతలు సంచరిస్తున్నాయన్న సమాచారంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి సంచరిస్తున్న చిరుత పులుల ఆచూకీ కనుగొని.. వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించి ఎన్నికల సిబ్బందికి, పంట పొలాలకు కాపలా వెళ్లే రైతులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# సౌమ్యకు కన్నీటి వీడ్కోలు

**మోస్రా మండలంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

**శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారులు**

**సుదర్శన్‌రెడ్డి, పోచారం, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి, కలెక్టర్, సీపీ**

**బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా**

**కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం**



**కంఠేశ్వర్ ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**
విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (24) అంత్యక్రియలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సౌమ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆమె స్వస్థలమైన నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రానికి తరలించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఖురేషి, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ తదితరులు సౌమ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.
అంతకుముందు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని మంత్రి జూపల్లి భరోసా కల్పించారు. కాగా, పోలీసు లాంఛనాలతో సౌమ్యకు తుది వీడ్కోలు పలుకగా, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు సౌమ్య అమర్ హై అని దారి పొడుగునా నినాదాలు చేశారు. సౌమ్య మృతితో మోస్రా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సౌమ్య ధైర్య సాహసాలు అనన్యం : మంత్రి జూపల్లి

విధి నిర్వహణలో సౌమ్య కనబర్చిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమని మంత్రి జూపల్లి అన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన సౌమ్య చిన్న వయసులో అశువులు బాసిందని, ఈ ఘటన యావత్ సమాజాన్ని తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఆమె మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుం దని తెలిపారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా ఆమె కుటుంబానికి పూర్తి జీతభత్యాలతో కూడిన పెన్షన్ అందిస్తామన్నారు.
భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని, ఎక్సైజ్ సిబ్బందికి కూడా ఆయుధాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించారు. విధి నిర్వహణలో ఉన్న వారిపై భవిష్యత్తులో ఎవరైనా ఈ తరహా దాడులు చేయాలంటే భయపడేలా మరింత కఠిన చట్టాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. యువతను నిర్వీర్యం చేసే గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రాష్ట్ర పొలిమేరల వరకు తరిమికొట్టేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే గంజాయి స్మగ్లర్లను పట్టుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం ఆవేదన కలిగించిందని అన్నారు.

సౌమ్య మృతికి సీఎం సంతాపం

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతికి కారణమైన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

**ప్రత్యేకంగా ఏం ప్రకటించని వైనం**

**రాష్ట్ర విజ్ఞప్తులను పట్టించుకోని మోడీ సర్కారు**

**విభజన హామీల ఊసేలేదు**

హైదరాబాద్ **ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**
కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పలుమార్లు కలిసి వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, వివిధ ప్రాజెక్టుల గురించి విజ్ఞాపన పత్రాలను అందించారు. తెలంగాణకు అండగా ఉండాలనీ, దాదాపు రూ.1.50 లక్షల కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరారు.
దీంతో 2026-27 కేంద్ర బడ్జెట్‌లో నిధులొస్తాయని ఆశించారు. కానీ కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశలు అడియాశలయ్యాయి. తెలంగాణ ఆవిర్భావం నుంచి కేంద్రంలో బీజేపీయే అధికారంలో ఉంది. ప్రధానిగా మోడీ కొనసాగుతున్నారు. అయినా ఏపీ పునర్విభజన చట్టాన్ని మాత్రం అమలు చేయడం లేదు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ విభజన హామీల ఊసేలేదు. అయితే కేంద్ర బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం అడగకపోయినా హైదరాబాద్-పూణె, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్- చెన్నై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడం గమనార్హం.

**నిధుల సమీకరణ ఎలా?**



రాష్ట్రానికి సంబంధించి దాదాపు 12 విభాగాల్లో 47 అంశాలు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దానికి రూ.34,367 కోట్లు ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణానికి రూ.45 వేల కోట్లు ఇవ్వాలని సూచించింది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రతిపాదనలకు అనుమతించడంతోపాటు నిర్మాణానికి రూ.44,028 కోట్లు మంజూరు చేయాలని కోరింది. గోదావరి నుంచి మూసీకి నీటిని మళ్లించే లింక్ ప్రాజెక్టుకు రూ.ఆరు వేల కోట్ల ఆర్థిక సాయం కావాలని విజ్ఞప్తి చేసింది. మూసీ పునర్జీవం పథకానికి నిధులు కేటాయించాలని కోరింది. బందర్ పోర్ట్, హైదరాబాద్ డ్రై పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనల కోసం రూ.17 వేల కోట్లు మంజూరు చేయాలని కోరింది.
ఆదిలాబాద్, కొత్తగూడెం, బసంత్ నగర్ విమానాశ్రయాలను ఆమోదించాలని తెలిపింది. రాష్ట్రంలో ఎనిమిది కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వాలని సూచించింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చాలని కోరింది. నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐఎంను ఇవ్వాలని సూచించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని కోరింది. తెలంగాణ ప్రభుత్వం చేసిన ఈ విజ్ఞప్తులను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. బడ్జెట్‌లో కనీసం ఒక్క అంశం కూడా ప్రస్తావనకు రాలేదు. దీంతో తెలంగాణ పట్ల ఎంత వివక్షను ప్రదర్శిస్తున్నదో అర్థమవుతున్నది. అయితే ఈ అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలా ముందుకుపోతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కేంద్రం సహకరించకుంటే ఈ అభివృద్ధి పనులు, వివిధ కార్యక్రమాలకు నిధుల సమీకరణ ఎక్కడి నుంచి తెస్తుందనేది రాష్ట్ర ప్రభుత్వం ముందు సవాల్‌గా ఉన్నది.

**రాష్ట్ర బడ్జెట్‌పై ప్రభావం**

2026-27 రాష్ట్ర బడ్జెట్‌పై ప్రజల్లో ఎన్నో ఆశలున్నాయి. వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఎక్కడి నుంచి తెస్తుందన్నది కూడా కీలకంగా మారింది. కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ప్రభావం పడుతుంది. నిధుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ బాటలో అప్పులు చేస్తుందా? లేదంటే భూములను అమ్ముతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. వీటితోపాటు కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. వాటి అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. అదే విధంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దుతామని లక్ష్యంగా నిర్దేశించుకుంది. కానీ నిధుల సమస్య రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతున్నది. అభివృద్ధిని, సంక్షేమ పథకాలను, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ముందుకు తీసుకుపోతుందో వేచిచూడాల్సిందే.

# సౌమ్య మృతికి బాధ్యులపై కఠిన చర్యలు

హైదరాబాద్: **ఫిబ్రవరి 01,ప్రజావినికిడి**
ఎక్సైజ్ కానిస్టేబు ల్ సౌమ్య మృతికి కారణమైనవారిపై కఠిన చర్య లు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీ సు శాఖను ఆదేశించారు. విధి నిర్వహణలో సౌ మ్య ప్రాణాలు కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్య క్తం చేశారు. సౌమ్య మృతిపట్ల రేవంత్‌రెడ్డి ఆదివా రం తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సౌమ్య కు టుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామ ని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. విధి నిర్వహణ లో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బా సిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రా ష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సౌమ్య భౌతికకాయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఆమె సర్వీస్ కాలం అంటే రిటైర్మెంట్ వయసు వరకు వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కాగా ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఒక్క రోజు వేతనాన్ని సౌమ్య కుంటుంబ సభ్యులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని, తమ సహచరిని కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు.



# హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు.. ప్రత్యేక పాత్రలలో సీనియర్ యాక్టర్స్



యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురు చూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'కింగ్‌డమ్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది.సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి 'రౌడీ జనార్దన్'ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్‌బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# స్పీడు పెంచిన రామ్ పోతినేని .. ఒకేసారి రెండు ప్రాజెక్ట్స్ సెట్స్ పైకి..!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తెలుగు సినీ పరిశ్రమలో తనదైన స్టైల్, డ్యాన్స్, ఎనర్జీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో. 2006లో విడుదలైన 'దేవదాసు' సినిమాతో హీరోగా పరిచయమైన రామ్ తొలి చిత్రంతోనే భారీ విజయాన్ని అందుకోవడంతో పాటు ఫిలింఫేర్ సౌత్ ఉత్తమ నూతన నటుడు అవార్డును సొంతం చేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన ఆయనకు యువతలో ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. అయితే గత కొన్నేళ్లుగా రామ్ సినిమాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడంతో సరైన బ్లాక్‌బస్టర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాకు మంచి రివ్యూలు వచ్చినప్పటికీ కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని నమోదు చేయలేకపోయింది. ఈ చిత్రానికి మహేష్ బాబు.పి దర్శకత్వం వహించగా కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించారు. ఈ ఫలితం రామ్‌ను మరింత జాగ్రత్తగా ఆలోచించేలా చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఈసారి కెరీర్‌లో స్పీడ్ పెంచి వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన నిర్ణయించుకున్నారని సమాచారం. ప్రస్తుతం రామ్ ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్‌లో ఓ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సైన్ చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉండగానే మరో కొత్త కథకు కూడా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. రామ్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా పక్కా మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ కథ సిద్ధమైందని, ముఖ్యంగా కథలోని ప్రధాన పాయింట్ ఆయనను బాగా ఆకట్టుకోవడంతో వెంటనే ఓకే చెప్పారని సమాచారం.ఆసక్తికర విషయం ఏమిటంటే ఆర్కా మీడియా సినిమా ప్రారంభం కాకముందే ఈ కొత్త దర్శకుడి చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలన్న ఆలోచనలో రామ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఆర్కా మీడియా ప్రాజెక్ట్‌ను కూడా మొదలుపెట్టి రెండు సినిమాలను ప్యారలల్‌గా షూట్

చేయాలన్న వ్యూహంతో ముందుకు సాగుతున్నారని ఇండస్ట్రీ టాక్. ఒకవైపు అగ్ర నిర్మాణ సంస్థతో భారీ సినిమా చేస్తూనే మరోవైపు కొత్త టాలెంట్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా తన కెరీర్‌కు కొత్త దిశ ఇవ్వాలని రామ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హై వోల్టేజ్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్, కమర్షియల్ అప్పీల్ కలిగిన ఈ రెండు ప్రాజెక్టులు రామ్ కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌పైకి తీసుకువస్తాయని అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. మొత్తానికి సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న రామ్ ఈసారి పక్కా ప్లానింగ్‌తో ఇండస్ట్రీలో తన స్థానం మరింత బలపర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.



# మెగా ఫ్యామిలీలో డబుల్ జాయ్ ముందు జన్మించింది ఎవరు?

టాలీవుడ్ మెగా కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన కొణిదెల దంపతులు కవలలకు తల్లిదండ్రులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఒక మగ శిశువుకు, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబం, కామినేని కుటుంబం ఆనందంలో మునిగిపోయాయి. మెగా అభిమానులు "డబుల్ జాయ్" అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. కవలల జననం అనంతరం రామ్ చరణ్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.మాకు ఒక పాప, ఒక బాబు పుట్టారని ఆనందంగా పంచుకుంటున్నాను. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటం మా జీవితాన్ని అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితంలో ఉన్న మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణంలో మాకు అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ ఆయన రాసిన మాటలు అభిమానుల హృదయాలను తాకాయి. ముఖ్యంగా తన జీవితంలో మహిళల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.ఈ గుడ్ న్యూస్ తెలిసిన వెంటనే మెగా అభిమానులు పెద్ద ఎత్తున అపోలో ఆసుపత్రి వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చుతూ పండగ వాతావరణాన్ని సృష్టించారు. సోషల్ మీడియా వేదికగా కూడా వేల సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు వరుసగా విషెస్ తెలియజేస్తున్నారు. రామ్ చరణ్ ఉపాసన దంపతులకు కవలలు పుట్టడంపై మెగాస్టార్ చిరంజీవి కూడా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మీడియాతో మాట్లాడుతూ,ఎప్పటి నుంచో మా ఇంట్లో ఇలాంటి శుభం జరగాలని కోరుకున్నాం. భగవంతుడి దయతో, హనుమాన్ కృప వల్ల ఒక ఆడబిడ్డ, ఒక మగబిడ్డ జన్మించారు. ఇది మాకు ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఉపాసన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన అపోలో ఆసుపత్రి వైద్య బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అపోలో ఆసుపత్రి వైద్యులు మీడియాతో మాట్లాడుతూ ఉపాసన, ఇద్దరు చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేశారు. మొదట బాబు, ఆ తర్వాత పాప జన్మించినట్లు వెల్లడించారు.

# సూర్య 46కు క్రేజీ టైటిల్.. లక్కీ భాస్కర్ డైరెక్టర్ ఏం ప్లాన్ చేస్తున్నాడో మరి..!

కోలీవుడ్ యాక్టర్ సూర్య లక్కీ భాస్కర్ ఫేం వెంకీ అట్లూరితో చేస్తున్న చిత్రం సూర్య 46 ఈ మూవీలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇంకా టైటిల్ ఖరారు కానీ ఈ చిత్రానికి మేకర్స్ ఓ పేరు ఫైనల్ చేశారన్న వార్త ఆన్‌లైన్‌లో రౌండప్ చేస్తోంది.తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి విశ్వనాథం అండ్ సన్స్ టైటిల్‌ను ఫిక్స్ చేశారని ఇన్‌సైడ్ టాక్. ఈ క్రేజీ టైటిల్ అఫీషియల్ అయితే ఇంతకీ సూర్యతో వెంకీ అట్లూరి ఎలాంటి కథను చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది.

అంతేకాదు ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. సూర్య కరుప్పు విడుదలైన తర్వాత ప్రమోషన్స్‌ను షురూ చేయనున్నారట.ఈ మూవీలో సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో సూర్య పాత్ర గజినీలో సంజయ్ రామస్వామి లైన్‌లో సాగనుందని టాక్ నడుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషిన్ షిప్ నేపథ్యంలో ఉండబోతున్నట్టు సమాచారం.సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.




# సోషల్ మీడియాలో హైలైట్ అయిన అల్లు స్నేహ రెడ్డిడ స్టైలిష్ లుక్‌తో ఫ్యాన్స్‌ను ఆకట్టుకున్న బన్నీ భార్య

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సతీమణి స్నేహ రెడ్డి సోషల్ మీడియాలో మరోసారి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. సినిమా రంగానికి నేరుగా సంబంధం లేకపోయినా, స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని ఫాలోయింగ్ ఆమె సొంతం. ఆమె షేర్ చేసే ప్రతి పోస్ట్ క్షణాల్లోనే వైరల్ కావడం సాధారణమైపోయింది. తాజాగా స్నేహ రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బేబీ పింక్ షేడ్ లాంగ్ డ్రస్‌లో ఎంతో ఎలిగెంట్‌గా కనిపించిన ఆమె, సింపుల్ మేకప్ మరియు నేచురల్ హెయిర్ స్టైల్‌తో క్లాస్ లుక్‌ను ప్రెజెంట్ చేశారు. డ్రస్‌కు తగ్గట్టుగా క్యారీ చేసిన మినిమల్ హ్యాండ్ బ్యాగ్ కూడా ఆమె స్టైల్‌ను మరింత హైలైట్ చేసింది.ఓవర్ స్టైలింగ్ లేకుండా సింపుల్‌గా కనిపించినా, అందులోనే ప్రత్యేకమైన గ్రేస్ కనిపించిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఫోటోలు షేర్ చేసిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి రావడంతో ఫ్యాన్స్ "గార్జియస్", "ఎవర్ గ్రీన్ బ్యూటీ", "హీరోయిన్‌లా ఉన్నారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అల్లు అర్జున్ అభిమానులు కూడా "సూపర్ వదినమ్మ" అంటూ కామెంట్లతో సందడి చేస్తున్నారు. సెలబ్రిటీలు సైతం ఆమె లుక్‌ను మెచ్చుకుంటూ రియాక్ట్ అవుతున్నారు.పొలిటికల్ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ, అల్లు అర్జున్‌ను ప్రేమించి వివాహం చేసుకున్న తర్వాత స్నేహ రెడ్డి పాపులారిటీ మరింత పెరిగింది. అయాన్, అర్హలతో కలిసి ఫ్యామిలీ మూమెంట్స్‌ను తరచూ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులతో టచ్‌లో ఉంటారు. ఫ్యాషన్ విషయంలో ఆమె ఎంపికలు ఎప్పుడూ ట్రెండీగా, క్లాసిక్ టచ్‌తో ఉండటం ప్రత్యేకత.

# విలక్షణ నటనతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా సుదేవ్ నాయర్

టాలీవుడ్‌లో తమ విలక్షణ నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మాలీవుడ్ యాక్టర్లు చాలా మందే ఉన్నారు. ఇటీవల కాలంలో తెలుగులో అలా తన యాక్టింగ్‌తో దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షిస్తున్న యాక్టర్ ఎవరైనా ఉన్నారా..? అంటే సుదేవ్ నాయర్ పేరు చెప్పొచ్చు. ముంబై మోడల్ కమ్ యాక్టర్ అయిన సుదేవ్ నాయర్ మలయాళ సినిమాలతో పాపులర్ అయి ఆ తర్వాత తెలుగులో కూడా పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.రవితేజ నటించిన టైగర్ నాగేశ్వర్ రావు టాలీవుడ్ జర్నీ మొదలు పెట్టిన ఈ టాలెంటెడ్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ దేవర పార్ట్ 1లో మెరిశాడు. గతేడాది పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషించిన ఓజీలో కూడా నటించి మెప్పించాడు. ఇక ఈ ఏడాది చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు చిత్రంలో వీరేంద్ర పాండేగా సుదేవ్ నాయర్ డిఫరెంట్ షేడ్స్‌లో నటించి మూవీ లవర్స్ నుంచి ప్రశంసలు అందుకుంటున్నాడు.ఇక ప్రస్తుతం కేజీఎఫ్ ఫేం యశ్ నటిస్తోన్న టాక్సిక్‌లో పవర్ ఫుల్ రోల్‌లో నటిస్తున్నాడు సుదేవ్ నాయర్. జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం ఉన్న సుదేవ్ నాయర్ రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో పవర్ ఫుల్ విలన్‌గా పేరు తెచ్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613